వేడెక్కుతున్న రాజకీయాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మరికొద్ది మాసాల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్ని పార్టీలు ఆ దిశగా సమా యత్తమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో విజయాన్ని సాధించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో పార్లమెంట్ టికెట్ కోసం రోజు రోజుకు పోటీ పెరుగుతున్నది. ఒకవైపు బీజేపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా అత్యధిక పార్లమెంట్ స్థానాలు తమవే అన్న ధీమాతో ఇప్పటికే సిట్టింగ్ ఎంపీలందరికి మళ్లీ పోటీ చేసే అవకాశాన్ని ఖరారు చేసింది. జాతీయ స్థాయి నేతలతో పార్టీ శ్రేణులు, నాయకుల్లో ఎన్నికల్లో విజయం సాధించేందుకు అనుస రించవలసిన వ్యూహాలను రూపొందిస్తున్నది. రాష్ట్రంలో పరాజయంతో ఆత్మ రక్షణ స్థితిలో పడ్డ బీఆర్ఎస్ తన కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపే దిశగా నియోజకవర్గాల స్థాయి సమావేశాలను ఏర్పాటు చేస్తూ ముందుకు సాగుతున్నది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పార్లమెంట్ ఎన్నికల కోసం ఆయా నియోజక వర్గాలకు ఇన్‌చార్జిలను ప్రకటించాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఇన్‌చార్జిగా నియమించగా, బీజేపీ పెద్దోళ్ల గంగారెడ్డిని పార్లమెంట్ నియో జకవర్గ సంస్థాగత ఇన్‌చార్జిగా నియమించారు. మూడు పార్టీల కార్యక్రమాలతో అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ముగియక ముందే రాజకీయ వేడి మళ్లీ రగులుతున్నది.



కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా కాంగ్రెస్ పార్టీ మానకొండూర్, చొప్పదండి, వేములవాడ, హుస్నాబాద్ నియోజకవర్గాలను దక్కించుకుంది బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో విజయం సాధించింది. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాలుగు స్థానాలు గెల్చుకున్నా ఓట్ల విషయానికి వస్తే ఏడు నియోజక వర్గాల పరిధిలో బీఆర్ఎస్ కాంగ్రెస్ కంటే ఐదు వేల ఓట్లను అధికంగానే సాధించి ఓట్ల విషయంలో సరిసమానంగా నువ్వా నేనా అన్నట్లు ఉన్నది. ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్‌కు 5,17,596 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 5,12,347 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 2,50,279 ఓట్లు దక్కాయి.

నియోజకవర్గ స్వరూపం

గత అసెంబ్లీ ఎన్నికల్లో 1.02 లక్షల ఓట్లు మాత్రమే సాధించిన బీజేపీ పార్ల మెంట్ ఎన్నికల సమయానికి 4,98,276కు పెంచుకుని ఎంపీ సీటును దక్కించుకున్నది. ఈసారి గత ఎన్నికలకంటే రెట్టింపు ఓట్లను పొందడంతో మళ్లీ తామే పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని బీజేపీ గట్టిగా చెబుతున్నది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ 4,98,276 ఓట్లు సాధించి ఎంపీగా గెలుపొందారు. రెండో స్థానంలో నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌కు 4,08,768 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌కు 1,79,258 ఓట్లు పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్లమెంట్ స్థానం గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల ఆలోచనా సరళి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుపై ఉంటుందని, వారి ఆలోచనలకు అనుగుణంగా గతంలో మాదిరిగానే ఈసారి కూడా బీజేపీకే అవకాశం కల్పి స్తారని ఆ పార్టీ నాయకులు విశ్వాసంతో ఉన్నారు.

- పార్లమెంట్ ఎన్నికలకు అన్ని పార్టీల వ్యూహరచన
- ఇప్పటికే నియోజకవర్గంలో పర్యటిస్తున్న నేతలు
- ఎంపీ టికెట్లకు కాంగ్రెస్‌లో పోటాపోటీ

ఎవరి ధీమా వారిదే..

బీజేపీ సిట్టింగ్ ఎంపీలందరికి మళ్లీ అవకాశం కల్పిస్తున్నామని ఆ పార్టీ అగ్రనేతలు నరేంద్ర మోదీ, అమిత్‌షా ఇప్పటికే ప్రకటించడంతో కరీం నగర్ సిట్టింగ్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్య దర్శి బండి సంజయ్‌కుమార్ కరీంనగర్‌లో పోటీ చేయ డం ఖాయమని తేలిపోయింది. ఇప్పటికే ఆయన నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పార్టీ జాతీయ స్థాయి నాయకులు పార్ల మెంట్ నియోజకవర్గాల పరిధిలో పర్యటిస్తూ పార్టీ ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల, నియోజకవర్గ స్థాయి నేతలకు కార్యాచరణ ప్రణాళికను వివరిస్తు న్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించలేక పోయినా పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకే ఓటు వేస్తారని, ప్రజల ఆలోచన సరళి ఆ దిశగానే ఉంటుందనే ధీమాతో బీజేపీ ముందుకు సాగుతున్నది.

బీఆర్ఎస్ అధికారికంగా తన అభ్యర్థిని ప్రకటించకపోయినా ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బి వినోద్‌కుమార్ మళ్లీ కరీంనగర్ నుంచి పోటీ చేయడం ఖాయమని భావిస్తున్నారు. ఆయన ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలను నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషించుకుని ఆ ఎన్నికల్లో జరిగినట్లుగా భావిస్తున్న లోటుపాట్లను సరిదిద్దుకుని ముందుకు సాగేందుకు నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసినా ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరిస్తారని ఆ పార్టీ నాయకత్వం భావిస్తున్నది.

అధికార కాంగ్రెస్ మాత్రం గెలుపు తమదేనన్న విశ్వాసంతో పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నది. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌నే ఆదరిస్తారన్న విశ్వాసంతో ఆ పార్టీ అభ్యర్థులుగా పోటీలో నిలవడానికి పోటీ పెరుగుతున్నది. గతంలో ఈ స్థానం నుంచి పోటీ చేసిన పొన్నం ప్రభాకర్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి గెలుపొంది రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. పార్టీ నాయకత్వం ఆయనను పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కూడా నియమించి పార్టీ అభ్యర్థిని గెలిపించే బాధ్యతను ఆయన భుజాలపై పెట్టింది.

కాంగ్రెస్‌లో పలువురు ఆశావహులు

కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో పోటీ చేసేందుకు టికెట్ ఆశిస్తున్నవారిలో ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టి సంతోష్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్ రావు ప్రముఖంగా పేర్లు వినిపిస్తున్నాయి. జీవన్ రెడ్డి గతంలో కరీంనగర్ పార్ల మెంట్ స్థానం నుంచి పోటీ చేసి పరాజయం పాలయ్యారు.

సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా, మాజీ మంత్రిగా ఆయనకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో విస్తృత సంబంధాలున్నాయి. ఆయన సొంత అసెంబ్లీ నియోజకవర్గం జగిత్యాల నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉంటుంది. గతంలో ఇక్కడ పోటీ చేసిన అనుభవం, సంబంధాలతో జీవన్‌రెడ్డి కరీంనగర్ టికెట్ ఆశిస్తున్నారు. మరేదైన కారణాలతో కరీంనగర్ నుంచి అవకాశం రాకపోతే నిజామాబాద్ స్థానం నుంచైనా పోటీ చేయడానికి ఆయన సుముఖంగా ఉన్నారు.

రెడ్డి సామాజికవర్గం ఓట్లు కరీంనగర్‌లో, నిజామాబాద్‌లో ప్రభావం చూపించే స్థితిలో ఉండడంతో తనకు మంచి అవకాశాలుంటాయని ఆయన పార్టీ ముందు ప్రతిపాదిస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ టి సంతోష్ కుమార్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేసేందుకు ఆసక్తితో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ఆయన పేరు ప్రకటించే దశలో అనివార్య కారణాలతో నిలిచి పోయిందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగింది. కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడిగా, ఎమ్మెల్సీగా పనిచేసిన సంతోష్ కుమార్‌కు బీసీ నేతగానే కాకుండా అన్ని వర్గాల ప్రజలతో, మైనార్టీలతో సత్సంబంధాలు న్నాయి. ఆయనను పోటీలో నిలిపితే ఇతర పార్టీల నుంచి కూడా పలువురు మద్దతు పలికే అవకాశం ఉంటుం దని పార్టీ వర్గాలు అంటున్నాయి.

కరీంనగర్ మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు కుమారుడు వెలిచాల రాజేందర్‌రావు టికెట్ ఆశిస్తున్నారు. జగపతిరావు, ఆయన తండ్రి కేశవరావు తొలి నుంచి కాంగ్రెస్‌వాదులుగా జిల్లాలో విస్తృత సంబంధాలు కలిగి ఉన్నారు. రాజేందర్ రావు 2009 లో ప్రజా రాజ్యం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. ఆ సమయంలో ఆయన లక్షా 76 వేల ఓట్లను పొందారు. చొప్పదండి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి పోటీ చేశారు.

ప్రస్తుతం ఆయన పార్లమెంట్ టికెట్ ఆశించడమే కాకుండా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని నియోజకవర్గాలలో ఎమ్మెల్యే అభ్యర్థులకు అను కూలంగా పర్యటించి అండగా నిలిచారు. వారందరి మద్దతు తనకు లభిస్తుందన్న ధీమాలో రాజేందర్ రావు ఉన్నారు. ఇంకా పలువురు పోటీ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నా ప్రధాన ఆశావహులుగా మాత్రం ఈ ముగ్గురి పేర్లే తెరపైకి వస్తున్నాయి.

ప్రజలకు ఉపయోగపడే మొక్కలు పెంచాలి

కలెక్టర్ పమేలా సత్పతి



మహాత్మానగర్ నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, జనవరి 11: ప్రజలకు ఉపయోగపడే విత్తనాలు సేకరించి వంద శాతం జర్మనేషన్ వచ్చేలా నర్సరీల్లో మొక్కలు పెంచాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని రామకృష్ణకాలనీ నర్సరీని, మహాత్మానగర్ గ్రామంలో గల పల్లె సంపద వనాన్ని ఆమె పరిశీలించారు. అందులో పెంచుతున్న మొక్కల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సరీలో మొక్కలు పెంచేందుకు గాను ప్రైమరీ బెడ్లు సక్రమంగా నిర్వహించాల న్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా ఎక్కువ పని దినాలు కల్పించాలని సూచించారు. మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి సిబ్బంది అందరూ కలిసి పచ్చదనం పెంపొందించే దిశగా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. నర్సరీలో పెంచే మొక్కలను సంప్రదాయ పద్ధతిలో జీవామృతం వంటి వాటిని వాడి పెంచాలని సూచించారు. మొక్కలను ప్లాస్టిక్ బ్యాగుల్లో కాకుండా సీడ్ బాల్స్‌లా తయారు చేసి పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీలత, అదనపు డీఆర్డీవో సంధ్యారాణి, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీవో కిరణ్ కుమార్, ఏపీవో లలిత కుమారి, ఈసీ రాజు పాల్గొన్నారు.


స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కరీంనగర్‌కు మెరుగైన ర్యాంకు

రాష్ట్రస్థాయిలో 2, జాతీయ స్థాయిలో 81వ ర్యాంకు

కరీంనగర్ టౌన్, జనవరి 11: రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకులు, అవార్డుల సొంతం చేసుకోవడం నగరపాలక సంస్థకే సాధ్యమని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. 2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కరీంనగర్ నగరపాలక సంస్థ రాష్ట్రస్థాయిలో 2, జాతీయ స్థాయిలో 81వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా మేయర్ సునీల్‌రావు విలేకరులతో మాట్లాడుతూ కరీంనగర్ నగరపాలక సంస్థ 446 నగరాలతో పోటీపడి 6,241 మార్కులతో 81వ ర్యాంకు సాధించిందన్నారు. రాష్ట్రంలో గ్రేటర్ హైదరాబాద్ మొదటి ర్యాంకు సాధించగా కరీంనగర్ నగరపాలక సంస్థ రెండో స్థానంలో నిలిచిందన్నారు. నగరపాలక సంస్థకు మెరుగైన ర్యాంకు, అవార్డులు సాధించడం గర్వకారణమన్నారు. ఇంత మంచి ర్యాంకు నగపాలక సంస్థకు రావడంలో తమ పాలకవర్గం కృషితోపాటు పారిశుధ్య కార్మికులు, సిబ్బంది, నగర ప్రజలు కృషి ఉందన్నారు. రాబోయే రోజుల్లో నగరపాలక సంస్థ మరెన్నో అవార్డులు, ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు.

నేడు యువ దివస్

స్వామి వివేకానంద జయంతి



గణేశ్‌నగర్,జనవరి 11: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనవరి 12న సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని (యువ దివస్) నిర్వహిస్తారు. భారతీయ సమాజ అభివృద్ధికి స్వామి వివేకానంద చేసిన కృషిని గౌరవించుకునేందుకు 1984 లో అప్పటి భారత ప్రభుత్వం ఆయన జయంతి రోజును జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించింది. కేంద్ర యువజన, వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం జనవరి 12 నుంచి 16 వరకు జాతీయ యువజన ఉత్సవాన్ని నిర్వహిస్తుంది.

● జాతీయ యువజన దినోత్సవం థీమ్స్ :

2011వ సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఒక థీమ్‌తో జాతీయ యువజన దినోత్సవం నిర్వహిస్తోంది. 2024 యువజనోత్సవాన్ని యువత ప్రపంచ సామరస్యం కోసం అనే థీమ్‌తో నిర్వహిస్తోంది.

యువత సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలి..

ఎ కిరణ్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత



మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలి. భారతీయ సంస్కృతిని విస్మరించకుండా ముందుకు సాగాలి. సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి

ఒత్తిడిని జయించాలి.

పెరుమాండ్ల అభిషేక్, యువజన సంఘం నాయకుడు



యువతీ, యువకులు విద్యా, ఉపాధిలో విజయం సాధించాలంటే ఒత్తిడిని జయించాలి. చాలామంది యువకులు తమ భవిష్యత్తు గురించి, ఒత్తిడికి ఆందోళనకు గురవుతున్నారు. సానుకూల దృక్పథంతో ముందుకు వెళితే ఎంత కష్టసాధ్యమైన పనినైనా సులువుగా చేయవచ్చు.

కొత్తపల్లికి క్లీన్‌సిటీ అవార్డు



కొత్తపల్లి పురపాలక సంఘ కార్యాలయం

కరీంనగర్ రూరల్, జనవరి 11: కొత్తపల్లి మున్సిపాలిటీకి స్వచ్ఛ స ర్వేక్షణ్ 2023లో భాగంగా క్లీన్‌సిటీ అవార్డు దక్కింది. దక్షిణ భారత దేశంలోని 15 వేల లోపు జనాభా గల మున్సిపాలిటీల్లో కొత్తపల్లి మున్సిపాలిటీ క్లీన్‌సిటీ అవార్డు దక్కించుకుంది. కొత్తపల్లి పట్టణానికి రెండోసారి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు రావడంపై మున్సిపల్ ఛైర్మన్ రుద్ర రాజు హర్షం వ్యక్తం చేశారు. కొత్తపల్లి పట్టణ అభివృద్ధికి సహక రించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, అధికారులు, పాలకవర్గం, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వివేకానందుడిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఎంపీ బండి సంజయ్‌కుమార్
- ఏబీవీపీ ఆధ్వర్యంలో 3కే రన్





3కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించి, రన్‌లో పాల్గొన్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

గణేష్‌నగర్, జనవరి 11: వివేకానందుడిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఏబీ వీపీ ఆధ్వర్యంలో కరీంనగనర్‌లో నిర్వహించిన 3కే రన్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భారత దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు వివేకా నందుడన్నారు. భారతీయ సనాతన ధర్మాన్ని, సంస్కృతిని ప్రపంచానికి ఆయన చాటిచెప్పారని తెలిపారు. చికాగో సర్వమత సమ్మేళనంలో వివేకానందుడు చేసిన ప్రసంగం ఎన్నటికీ మరువలేనిదన్నారు. వివేకానందుడి స్ఫూర్తితో ప్రధాని నరేంద్రమోదీ భారత్‌ను ప్రపంచంలో నంబర్‌వన్‌గా తీర్చిదిద్దే పనిలో ఉన్నారన్నారు. కార్య క్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్, విభాగ్ ప్రముఖ్ మురళి, ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ అజయ్, విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ శ్రీకాంత్, జిల్లా ప్రముఖ్ గిరిబాబు, నగర కార్యదర్శి నందు, ప్రమోద్, శ్రీవర్ధన్, సాయి తేజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అనూష, మధు, ప్రసన్న పాల్గొన్నారు.

ఆర్వోబీ పనులు త్వరగా పూర్తి చేయాలి

- భూసేకరణ సాకుతో పనుల్లో జాప్యం చేస్తే సహించేది లేదు
- రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు చేయాలి
- ఎంపీ బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, జనవరి 11: నగరంలోని కరీంనగర్ రైల్వే స్టేషన్, తీగలగుట్టపల్లి వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ రైల్వే స్టేషన్‌తోపాటు, ఆర్వోబీ నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణంపై అధికారులు వెంటనే యాక్షన్ ప్లాన్ ఇవ్వాలన్నారు. యాక్షన్ ప్లాన్ లేదంటూ నీళ్లు నమిలిన అధికారులు, భూసేకరణ సమస్యను ప్రస్తావించిన ఆర్ అండ్‌బీ అధికారులపై మండిపడ్డారు. ఇన్నాళ్లుగా పనులు జరుగుతు న్నా ఈ విషయాన్ని తన దృష్టికి ఎందుకు తీసుకు రాలేదన్నారు.


భూ సేకరణ సాకుతో పనుల్లో జాప్యం చేస్తే క్షమించేది లేదన్నారు. ఆర్వోబీ పనులు జరుగుతున్న చోట రోడ్డు కొట్టుకుపోయి దుమ్ము ధూళితో జనం ఇబ్బందులు పడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయాలన్నారు. కాంట్రాక్టర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. పనుల్లో నాణ్యత లోపి స్తున్నా, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఏం చేస్తున్నారని అధికా రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం పనులు చేస్తే కాంట్రా క్టర్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. పనుల విషయంలో అధికారులు జవాబుదారీగా ఉండాల్సిందేనన్నారు. ఆర్వోబీ నిధులన్నీ కేంద్రాని వేనన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు.

ఆర్వోబీ ప్రతిపాదనలు ఎప్పుడో రెడీ అయ్యాయి? నిధులెప్పుడో మంజూరయ్యాయి? పనులు మొదలై నాలుగు నెలలు దాటింది ఏనాడైనా ఈ సమస్య గురించి నాకు చెప్పారా ఎందుకు చెప్పలేదన్నారు. పనులను పరిశీలించడానికి వస్తే భూసేకరణ సమస్య గుర్తుకు వచ్చిందా అంటు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంట్రాక్టర్‌కు సమాచారం ఇచ్చినా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. భూసేకరణ సమస్యతో పనులను సాగదీస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. నిర్దేశిత గడువులోగా ఆర్వోబీ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో ఉన్నతాధికారులతో కలిసి ఆధునీకరణ పనులను పరిశీలించారు. రైల్వే స్టేషన్ పనులు మార్చి రెండో వారాని కల్లా పూర్తవుతాయని, మార్చి నెలాఖరునాటికి ప్రజలకు అందు బాటులోకి వస్తుందన్నారు. ఆధునీకరణ పనులు పూర్తయ్యాక లోడింగ్ పాయింట్‌ను వేరే చోటికి మారుస్తామంటున్నారని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు దృష్టికి తీసుకురావడంతో లోడింగ్ పాయింట్‌ను అక్కడే ఉంచాలన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకు రావాలని, రైల్వే శాఖ మంత్రి, రైల్వే జీఎంతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) లేక పోవడంతో ఏళ్ల తరబడి ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఆర్వోబీ నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమాత్రం సహకరించలేదన్నారు. నిధుల మంజూరులోను జాప్యం చేసిందన్నారు. కేంద్రం నిధులు విడుదల చేస్తే రాష్ట్రం వాటా ఇవ్వ కుండా ఇబ్బంది పెట్టిందరన్నారు. చివరకు సేతుబంధన్ పథకం కింద 100 శాతం నిధులను కేంద్రమే మంజూరు చేసిందన్నారు. భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, అయినా ఇప్పటి వరకు భూసేకరణ చేయకుండా జాప్యం చేస్తున్నారన్నారు. ఇన్నాళ్లు మాట్లాడకుండా ఇప్పుడు భూసేకరణ సమస్య ఉందని అధికారులు చెబుతు న్నారన్నారు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా సహకరించా లని కోరు తున్నామన్నారు. ఏడాది లోపు ఆర్వోబీ పనులు పూర్తి చేయాలన్నారు. పనులు సరిగా చేయకపోతే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పనులకు పూర్తిగా జవాబుదారీ అధికారుల దేనన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు.







ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


కోల సంతోష్(ఫైల్)

జమ్మికుంట రూరల్, జనవరి 1: జమ్మికుంట మండలం మడిపల్లి రైల్వే గేట్ సమీపంలో గురువారం ఆర్థిక ఇబ్బందులు తాళలేక గుర్తు తెలియని రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం శ్రీరాములపేట గ్రామానికి చెందిన కోల సంతోష్ (28) కమలాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా డు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై మడిపల్లి కెనాల్ సమీపంలో ద్విచక్ర వాహనం పార్క్ చేసి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య నాగమణి, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీస్‌లు తెలిపారు.

బీరు సీసాతో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జనవరి 11: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన నిజానపు శివాజీపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బీరు సీసాతో దాడి చేశారు. ఈ ఘటనలో శివాజీ తలకు, చెంపకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలట్ ఖాజా ఖలీల్ లాల్‌లు సంఘటన స్థలానికి చేరుకొని హుజూరాబాద్ ఆస్పత్రికి తర లించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, జనవరి 11: శంకరపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన కామెడి సాంబశివరెడ్డి (48) ఈ నెల 10న ఇంటి నుంచి వ్యవసాయ బావి వద్దకు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ సమయంలో హుజూరాబాద్ వైపు నుంచి ఎదు రుగా వస్తున్న సైదాపూర్ మండలం సోమారం గ్రామానికి చెందిన ములు గూరి జాన్ తన బైక్‌ను అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ కరీంనగర్-వ రంగల్ రహదారిపై కొత్తగట్టు శివారులో ఢీ కొట్టాడు. కింద పడిన ఈ సాంబశివారెడ్డికి తల భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొం దుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్లు ఎంపిక పోటీలు

రామడుగు, జనవరి 11: రామడుగు మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జట్ల ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. ఈ నెల 17న ఆసిఫాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఇక్కడ ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంపిక చేశారు. పోటీలను స్థానిక సర్పంచ్ పంజాల ప్ర మీల ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, కార్యద ర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో చోరీ

జగిత్యాల టౌన్, జనవరి 11:జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణి పేటలో చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి అర తులం బంగారంతో పాటు రూ. 5 వేల నగదును అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పురాణి పేటకు నోముల సాగర్ కుటుంబ నెల రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి అమెరికాకు వెళ్లి గురువారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తలుపులకు ఉన్న తాళం పగులగొట్టి ఉండడం చూసి దొంగతనం జరిగినట్లుగా గుర్తించారు. దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగులగొట్టి విలువైన వస్తువులతో పాటు బంగారం, నగదు అపహరించుకవెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. వేలి ముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నటేష్ పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డీబార్

గణేశ్‌నగర్, జనవరి 11: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ ఒకటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం నలుగు రు విద్యార్థులను డీబార్ చేసినట్లు శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో సెమిస్టర్ పరీక్షలో కరీంనగర్‌లోని ట్రినిటి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, వికాస్ డిగ్రీ కళాశాలలో ఒకరు, అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల లో ఒకరు మొత్తం నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.



యువత దేశసేవలో పాల్గొనాలి

- ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య సంకసాల మల్లేష్



శిక్షణా శిబిరానికి ఎంపికైన వలంటీర్లతో వీసీ ఆచార్య సంకసాల మల్లేష్

గణేశ్‌నగర్, జనవరి 11: జాతీయ సాహస శిక్షణ శిబిరాల్లో యువత పాల్గొని మానసిక, శారీరక దృఢ సంకల్పంతో దేశ సేవలో పాల్గొనాలని శాతావాహన యూనివర్సిటీ(ఎస్‌యూ) ఉపకులపతి ఆచార్య సంకసాల మల్లేష్ పిలుపునిచ్చారు. హిమాచల్‌ప్రదేశ్‌లో (నార్కంద) లోని అటల్ బిహారి వాజ్‌పేయి పర్వతారోహణ సంస్థలో శిక్షణ శిబిరానికి ఎంపికైన పదిమంది వలంటీర్లు తమ శిక్షణను పూర్తి చేసుకుని వచ్చిన సందర్భంగా వీసీ వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ఇంకా ఇలాంటి శిక్షణ శిబిరాల్లో పాల్గొని మానసిక, శారీరక దృఢ సంకల్పంతో దేశ సేవలో పాత్రులుగా కావాలని పిలుపునిచ్చారు. జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ ఈ మనోహర్ మాట్లాడుతూ వలంటీర్లు పర్వతారోహణ, ఇతర సాహస కార్యక్రమాల్లో శిక్షణ తీసుకున్నారని వీరు శాతవాహన యూనివర్సిటీలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులని, మంచి భవిష్యత్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ శిక్షణ శిబిరం కంటిన్జెంట్ లీడర్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు విజయ ప్రకాష్, డాక్టర్ తిరుపతి, డి విజయ్ కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎక్స్‌కావేటర్ స్వాధీనం

శంకరపట్నం, జనవరి 11: శంకరపట్నం మండలం మక్త గ్రామ గుట్ట నుంచి అక్రమంగా మట్టి తవ్వుతున్న ఎక్స్‌కావేటర్‌ను గురువారం స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ అనుపమ చెప్పారు. వెంచర్లకు ఎలాంటి అనుమతి లేకుండా మక్త గుట్ట నుంచి మట్టి తరలిస్తున్న ఎక్స్‌కావేటర్‌ను పట్టుకొని కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారం ఘటనలో ఒకరి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్

చందుర్తి, జనవరి 11: చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులోని శ్మశాన వాటిక వద్ద వృద్ధురాలిపై అత్యాచారం ఘటనలో ఒకరిని అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 9న కట్టలింగంపేట గ్రామానికి చెందిన ఆవునూరు తిరుపతి అనే వ్యక్తి ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని బలవంతంగా తన ఆటోలో ఎక్కించుకొని లింగంపేట శివారుకు తీసుకెళ్లి ఆటోలో అత్యాచారం చేశాడు. తిరిగి ఆటోలో లింగంపేట బస్టాండ్ వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం నిందితుడు సనుగుల నుంచి వేములవాడ వెళుతున్నాడని సమాచారంతో మర్రిగడ్డ ఎక్స్ రోడ్ వద్ద పట్టుకున్నట్లు, ఆటో, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 11 : కరీంనగర్‌లోని లక్ష్మీనగర్‌లో పేకాట ఆడుతున్న ఒక స్థావరంపై గురువారం కరీంనగర్ స్పెషల్‌బ్రాంచి సీఐ కే సృజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి 1.40 లక్షల రూపాయలు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ధర్మారం,జనవరి11: మండలంలోని బొమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బొల్లి లచ్చయ్య(60) అనే వృద్ధుడు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. గత నెల 30న రాత్రి ఇంటి ముందు చలిమంట కాగుతుండగా మంటలంటుకున్నాయి. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుని కొడుకు బొల్లి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాటం ఉధృతం'

గణేశ్‌నగర్, జనవరి 11 : జనాభా దామాషా ప్రకారం బీసీల వాటా కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ బీసీలకు గురువారం పిలుపునిచ్చారు. బీసీ మహనీయుల జన్మ స్థలాలను సందర్శించే కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి నివాళులర్పించారు. చట్ట సభల్లో బీసీ వాటా, బీసీ హక్కుల సాధన కోసం అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బాక రమేష్, పెంట అజయ్ పటేల్, మునిగాంటి అశ్విన్, గిరిగాని భిక్షపతి, కార్యదర్శి తౌటం సత్యం, కాల్వ మధుబాబు, కాల్వ కిషన్, రాంపర్తి వికాస్, సాయికిరణ్, పాల్గొన్నారు.

పందెం కోడికి వేలం

భగత్‌నగర్, జనవరి 11: ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన పందెం కోడికి నేడు కరీంనగర్-2 డిపోలో వేలం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీన ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన కోడికి సంబంధించి ఎవరూ రాలేదన్నారు. కరీంనగర్ అంబేద్కర్ బస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆసక్తికల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కరీంనగర్ రూరల్, జనవరి 11: వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు ఫెర్టిలైజర్ ఇన్వెంటోరీ వెరిఫికేషన్ సిస్టం ద్వారా కరీంనగర్ రూరల్ మండలంలోని గురువారం వ్యవసాయాధికారి బి సత్యం మూడు దుకాణాలను తనిఖీ చేశారు. తీగలగుట్టపల్లిలోని కేడీసీఎంఎస్, వల్లంపహాడ్‌లోని వాసవి ఫెర్టిలైజర్స్, నగునూరులోని అగ్రోస్ సెంటర్ దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ, ఈపాస్ మిషన్‌తోపాటుగా నిల్వఉన్న ఎరువులు సరిపోయే వరకు ఆయా దుకాణాల పేర్లు ప్రతీ వారం తనిఖీ నిర్వహిస్తామని తెలిపారు.

చొప్పదండి: పట్టణంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి గురువారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వల వివరాలను నమోదు చేసుకున్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొత్తకొండ జాతరకు ప్రతీ రోజు 80 ఆర్టీసీ బస్సులు

భీమదేవరపల్లి, జనవరి 11 : కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొత్తకొండ జాతరకు ప్రతిరోజు హుజూరాబాద్ నుంచి 80ట్రిప్పుల ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం కొత్తకొండ జాతరలో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్‌ను పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు హుజూరాబాద్ డిపో నుంచి 20 బస్సులను రోజు 80ట్రిప్పులు నడపనున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ. 60, చిన్నారులకు రూ. 30 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులను హుజూరాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్, ముల్కనూర్, కొత్తకొండకు ప్రయాణీకులను చేరవేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళా ప్రయాణికులకు ఉచితంగా జాతరకు చేరవేస్తామన్నారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్రస్వామిని దర్శించుకున్నారు. కాగా కొత్తకొండ జాతరకు రావాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు దేవాలయ అర్చకులు, సిబ్బంది గురువారం ఆహ్వాన పత్రం అందజేశారు.

అక్షర సూర్యుడు 'అలిశెట్టి'

- జగిత్యాల జైత్రయాత్రలో కలం ఎర్ర సూరీడై..
- సాహితీ మిత్రదీప్తితో కవిత్వంపై అభిలాష
- నేడు అలిశెట్టి జయంతి, వర్ధంతి



అలిశెట్టి ప్రభాకర్

జగిత్యాల/సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్ జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పద సంపద పరిమితమైన అపరిమితమైన భావసంపద ఉన్న కవిత్వం అతని సొంతం..పొట్టి పొట్టి వ్యాక్యాల్లో పొడవైన వాదాన్ని పూరించి సూటిగా ప్రశ్నించడమే ఆ..కవితల గొప్పతనం. పొట్టి కవితల్లో తన వాదాన్ని గట్టిగా వినిపించిన కవి అలిశెట్టి ప్రభాకర్. నిర్భయంగా, నిజాయితీగా తన మదిలో మెదిలిన ఆలోచనలను కలంలో నింపి, అక్షరాలను ప్రకాశింప జేసిన కవనసూరీడు అతడు. అలిశెట్టి జన్మించింది, మరణించింది ఒకే తేదీన కావడం యాధృచ్ఛికమైనా మరణం నా చివరి చరణం కాదు అని ప్రకటించిన అక్షర వీరుడిగా సాహితీ అభిమానుల్లో చెదిరిపోని ముద్రను వేసుకున్నాడు. నేడు అలిశెట్టి జయంతి, వర్ధంతి సందర్భంగా అందిస్తోన్న ప్రత్యేక కథనం..

● అడుగడుగున అలిశెట్టికి కష్టాలే...

జగిత్యాలలో 1956 జనవరి 12న జగిత్యాలలోని అంగడిబజార్ ప్రాంతంలో జన్మించిన అలిశెట్టి ప్రభాకర్‌కు ఏడుగురు అక్కాచెల్లెల్లు, ఇద్దరు అన్న దమ్ములు కాగా ప్రభాకర్ ఐదోవాడు. అలిశెట్టికి భార్య భాగ్యలక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకు దెరువు కోసం తన అభిరుచులైన చిత్రలేఖనం, ఫొటోగ్రఫీని వినియోగించుకున్నాడు. సిరిసిల్లలో ఫొటోగ్రఫీ నేర్చుకుని, 1975లో జగిత్యాలలో పూర్ణిమ స్టూడియోను ప్రారంభించాడు. 1979లో కరీంనగర్‌లో స్టూడియో శిల్పి నడిపాడు. 1982లో హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. 1983లో స్టూడియో చిత్రలేఖ స్థాపించాడు. హైదరాబాద్ నగర జీవితాన్ని 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో సిటీ లైఫ్ సీరియల్‌గా రాశాడు.

● జగిత్యాల జైత్రయాత్రలో సాహితీ భాగస్వామ్యం..

సాహితీ మిత్ర దీప్తి సంస్థ పరిచయంతో కవిత్వంపై అలిశెట్టికి అభిలాష ఏర్పడింది. 1978లో జగిత్యాల జైత్రయాత్రతో తన కలం ఎర్ర సూరీడై ప్రజ్వలించింది. దోపిడి దారుల అకృత్యాలు, పెత్తందారుల అణిచివేత లతో సతమతమవుతున్న ప్రజల హృదయ ఘోషను తన కవితా వస్తువుగా మలుచుకున్నాడు. రగిలిన గుండె ఎర్రపావురమై ఎగిరి జైత్ర యాత్ర లో సాహితీ భాగస్వామ్యాన్ని అందించాడు. ఆ తదుపరి మంటల జెం డాలు, చురకలు, రక్తరేఖ, ఎండమావి, సంక్షోభ గీతం, సిటీలైఫ్ సంపుటా లు ముద్రితమయ్యాయి. అనారోగ్యం బారిన పడి 1993 జనవరి 12న అస్తమించాడు. అతడు అస్తమించినా అలిశెట్టి మినీ కవిత్వం ప్రతీ నోట వినబడుతోంది

● మారసం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

సాహితీవేత్త అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతిని సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఘనంగా నిర్వహిస్తోంది. గురువారం సిరిసిల్లలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అలిశెట్టి కవిత్వంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని శారద మాట్లాడుతూ అలిశెట్టి ప్రభాకర్ మినీ కవితల ద్వారా సమాజ హితాన్ని కోరుకున్నారన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశం కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టీవీ నారాయణ, కార్యానిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి, ప్రధాన కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, రచయిత బూర దేవానందం, ఉపాధ్యాయులు జయంతి, సతీష్‌బాబు, రమేష్, కరికె నరేందర్ పాల్గొన్నారు.



బాల్య మిత్రులతో అలిశెట్టి

నృసింహుడి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ధర్మపురి, జనవరి 11: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం హుండీ లెక్కింపు గురువారం నిర్వహించగా రూ 54,21,314 ఆదాయం లభించింది. 95 రోజులకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. అలాగే 90 గ్రాముల మిశ్రమ బంగారం, 6 కిలోల 200 గ్రాముల మిశ్రమ వెండి, 31 విదేశీ నోట్లు లభించాయి. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఎ. చంద్రశేఖర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివా సాచార్యులు, సీనియర్ అసిసెంట్ అలువాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్ పాల్గొన్నారు.

● ఆలయానికి స్టీల్ హుండీలు బహూకరణ

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్షాన రూ 2 లక్షలు విలువ గల రెండు హుండీలను ఆ బ్యాంక్ డీజీఎం శంకర్ హేంబ్రం చేతుల మీదుగా గురువారం సమర్పించారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం రెండు స్టీల్ హుండీలను ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌కు అందించారు. ఆలయం పక్షాన ఆయనను స్వామి శేష వస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుబీఐ జగిత్యాల జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పొన్న వెంకటరెడ్డి, చీఫ్ మేనేజర్ సరల్‌గుప్తా, ధర్మపురి బ్రాంచ్ మేనేజర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 11: సిద్దిపేట జిల్లాలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్ల వివరాలను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ ప్రకటించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు.

● ఎంపికైన జట్లు..

బాలికల విభాగంలో బి ప్రవళిక(ధర్మారం), జి అంజలి (ధర్మారం), బి వైష్ణవి(కొడిమ్యాల), కె వెన్నెల(కుమ్మరిపల్లి), ఆర్ పూజిత(కుమ్మరిపల్లి), గౌరి పూజిత(కరీంనగర్), ఆర్ అఖిల(కుమ్మరిపల్లి), టి శిరీష(ధర్మారం), సిరిచందన, లిఖిత(మానకొండూర్), బి జలజ(కొడిమ్యాల), బి లేఖన, ఎన్ వైష్ణవి(కుమ్మరిపల్లి), ఎన్ చరణి(ధర్మారం), జి కావ్య (కుమ్మరిపల్లి), బి శ్రావ్య(కొడిమ్యాల) ఎంపికయ్యారు.

బాలుర విభాగంలో ఆర్ అనిల్, ఆర్ హర్షవర్ధన్(మానకొండూర్), ఎ వర్షిత్(మల్యాల), ఓ సాయి, డి సిద్ధార్థ(ధర్మారం), ఎ మనోజ్‌కుమార్, టి అరుణ్ కుమార్, బి రాహుల్, సీహెచ్ రిషి(కుమ్మరిపల్లి), ఎ రోహిత్, కె అభినవ్(కరీంనగర్), టి బాలాజీ(దేవంపల్లి), డి శ్రీనివాస్(ధర్మారం), జె నాగరాజు(నందిమేడారం), ఎండీ రియామొద్దీన్(కేశవపట్నం) ఎంపికయ్యారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక జనవరి 11: మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్నా ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణ చేస్తున్నా డ్రైవర్ రాయనవేని హరీష్, యాజమని రాయవేని సంపత్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మల్లికార్జున స్వామి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

గొల్లపల్లి, జనవరి 11: ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లన్నపేట మల్లికార్జున స్వామి దేవాలయం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా హుండీ ఆదాయం రూ.22,37,246లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో హుండీ ద్వారా రూ.18,10,786, టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.4,26,460, మిశ్రమ బంగారం 10 గ్రాముల 500 మి.గ్రా., మిశ్రమ వెండి 790 గ్రాములు సమకూరినట్లు చైర్మన్ కొండూరు శాంతయ్య, ఈవో విక్రమ్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రవి కిషన్, నాయకులు సిద్ధంకి మల్లయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గొల్లపల్లి, జనవరి 11: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన బుర్ర గడ్డ శివ కుమార్ (21) గురువారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన బుర్రగడ్డ లత-శంకరయ్య దంపతులకు ఒక్కగానొక్క కొడుకు శివ కుమార్ మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. శివ కుమార్ ఇటీవల గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. తన పెద్దనాన్న గంగన్నతో కలిసి తాటి చెట్టు ఎక్కడానికి శ్రీరాములపల్లె గ్రామంలో రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాన్ని నిలుపుతున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి వైపు నుంచి హన్మాజీపేటకు చెందిన ప్రేమ్ కుమార్ అనే యువకుడు ద్విచక్ర వాహనంతో అతి వేగంగా ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న శివ కుమార్‌తో పాటు గంగన్నలు రోడ్డు పక్కన ఎగిరిపడ్డాడు. ఈ ప్రమాదంలో శివ కుమార్ తలకు తీవ్ర గాయాలు కాగా, గంగన్నకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు జగిత్యాల ప్రధాన ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యుల సూచనల మేరకు కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో శివకుమార్ మృతి చెందాడు. దీంతో శ్రీరాములపల్లె గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

తంగళ్లపల్లి, జనవరి 11: తంగళ్లపల్లి మండల కేంద్రంలో చెన్నూరి పోశయ్య (30) అనే వలస కూలీ కుటుంబ కలహాలతో బుధవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన చెన్నూరి పోశయ్య, చిట్టి దంపతులు మూడు సంవత్సరాల క్రితం తంగళ్లపల్లికి వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యభర్తలకు గొడవ జరగడంతో భార్య చిట్టి తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లోనే చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కమాన్‌పూర్, జనవరి 11 : మండలంలోని గుండారం గ్రామపరిధిలోని రాజేంద్రనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సైంటిక్లయిన్ కాలనీకి చెందిన అభిషేక్ తన ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి నుంచి స్వగ్రామం వైపు వస్తుండగా, గుండారం గ్రామానికి చెందిన పోలుదాసరి శేఖర్ తన ద్విచక్ర వాహనంపై రాజేంద్రనగర్ వైపు వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. శేఖర్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దపల్లి ప్రభుత్వా సుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలను సేకరించారు.

వివాహిత బలవన్మరణం

కోనరావుపేట, జనవరి 11: కోనరావుపేట మండలం బావుసాయిపేటలో వరకట్నం వేధింపులతో ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతురాలి భర్త, అత్తమామపై గొడవకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గొడవ జరగకుండా బందోబస్తు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం... కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన సయ్యద్ అస్లీమ్‌తో వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన నజీనా (21)కు రెండు సంవత్సరాల క్రితం పెళ్లి చేశారు. వివాహ సమయంలో ఐదు తులాల బంగారం, లక్ష రూపాయల నగదు, రెండు లక్షల బండి ఇచ్చి వివాహం చేశారు. వివాహం చేసిన అనంతరం ఆరు నెలలు బాగానే ఉన్నారు. అప్పటి నుంచి మరో రెండు లక్షల రూపాయలు కట్నం తేవాలని భర్త అస్లం, మామ హైదర్, అత్త గోరబి వేధించారు. మరోవైపు మూడు నెలల పాప కళ్లు కనిపించకుండా పుట్టడం నజీనాను కుంగ తీసింది. పాపకు హైదరాబాద్‌లో చికిత్స చేయించడానికి మూడు లక్షల రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. భర్త పట్టించుకోకపోవడంతో వీరి మధ్య దూరం పెరిగింది. ఈ క్రమంలోనే మనోవేదనకు గురైన నజీనా గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్య గల కారణాలను పరిశీలించారు. గొడవలు జరగకుండా వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి, చందుర్తి సీఐ కిరణ్ కుమార్, కోనరావుపేట ఎస్సై ఆంజనేయు బందోబస్తు నిర్వహించారు. మృతురాలి తండ్రి మహమ్మద్ ఇచ్చిన ఫిర్యాదుతో భర్త అస్లం, మామ హైదర్, అత్త గురబీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌బీఐ ఏటీఎం చోరీకి యత్నం

సిరిసిల్ల క్రైం, జనవరి 11: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి దొంగలు ప్రయత్నించారు. గురువారం తెల్లవారు జామున బీవైనగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగలు చొరబడి బద్దలుకొట్టి దొంగిలించేందుకు యత్నించారు. ఈ చోరీ యత్నంపై ఏటీఎం సూపర్‌వైజర్ ఎస్.మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీ

కోల్‌సిటీ, జనవరి 11: గోదావరిఖని మార్కండేయ కాలనీ, వెంకటేశ్వరకాలనీలో బుధవారం రాత్రి తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. మార్కండేయ కాలనీలోని ఎండీ అఫ్జాద్‌పాషా ఇంటికి తాళం వేసి వెనుక గదిలో నిద్రిస్తుండగా ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డ దొంగలు ఇంట్లోని తులంన్నర బంగారం, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముల్కనూర్ డెయిరీ సందర్శన

భీమదేవరపల్లి, జనవరి 11: ముల్కనూర్ మహిళా డెయిరీలో అమలు చేస్తున్న డీబీఎఫ్ ప్రాజెక్టును నాబార్డ్ అధికారులు గురువారం సందర్శించారు. నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీనాథ్, అసిస్టెంట్ మేనేజర్ మహాదేవ్ రెడ్డి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేస్తే చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

ఇల్లందకుంట, జనవరి 11: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఇల్లందకుంట పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఆదివారం రాత్రి ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. మండలంలోని సిరిసేడు, బోగంపాడు గ్రామాలకు ఇల్లందకుంట శివారులోని ఎర్రగట్టు గుట్టల సమీపంలో ఆ రెండు గ్రామాలకు ఎకరం భూమిని కేటాయించారని చెప్పారు. కానీ కొందరూ వ్యక్తులు ఆ ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసి ఆ భూమిని అక్రమించేందుకు కుట్ర పన్నినట్లు వెల్లడించారు. ఆ స్థలంలో 2,450 మొక్కలు నాటారని చెప్పారు. సుమారు వాటి ఖర్చు రూ. 6,44,436 అయినట్లు వివరించారు. కాగా సిరిసేడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ చిన్నరాయుడు, రేణికుంట్ల రామస్వామి ఆ భూమిని అక్రమించుకోవాలని కుట్ర పన్నారని చెప్పారు. ఈ క్రమంలో సిరిసేడు గ్రామానికి చెందిన సల్పల రమేశ్‌కు చెందిన ఎక్స్‌కావేటర్ సహాయంతో చెట్లను తొలగించారని చెప్పారు. సోమవారం ఉదయం ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన సంఘటనపై పంచాయతీ కార్యదర్శి అంకూస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఈ మేరకు చిన్నరాయుడు, రామస్వామి, సల్పల రమేశ్, ఎక్స్‌కావేటర్ డ్రైవర్ శశికుమార్‌లను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుల నంఉచి మోటర్ సైకిల్, ఎక్స్‌కావేటర్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆస్తులను ధ్వంసం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సీఐ కిశోర్, ఎస్‌ఐ రాజకుమార్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు. ఇంత జరిగిన నిందితులను అరెస్టు ను విలేకరులకు చూపకపోవడం గమనార్హం. సమావేశంలో రూరల్ సీఐ కొరె కిశోర్, ఎస్‌ఐ రాజకుమార్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో డ్రైవింగ్‌లో శిక్షణ

- టైడ్స్ ప్రిన్సిపాల్ రాఘవన్

సిరిసిల్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డ్రైవింగ్ శిక్షణ అందిస్తున్న టైడ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ పరిశోధన సంస్థ ప్రిన్సిపాల్ బూవ రాఘవన్, జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు తెలిపారు. గురువారం అంతర్జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం సందర్భంగా తెలంగాణలో అతి పెద్ద తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్)లో అంతర్జాతీయ ప్రమాణాల ద్వారా చేపడుతున్న కార్యకలాపాలు, రహదారి భద్రతపై సదస్సు నిర్వహించారు. జిల్లాలోని పాత్రికేయ బృందం ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రాఘవన్, కొండల్‌రావు మాట్లాడుతూ డ్రైవింగ్ శిక్షణ సంస్థలో మెకానికల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దేశంలో ఏటా 4.50 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాల్లో 1.50 లక్షల మంది మరణిస్తున్నారని అన్నారు. ఇందులో యువతనే ఎక్కువగా ఉంటున్నారన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన లేకపోవడం సరైన శిక్షణ లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లకు శిక్షణ ఇచ్చేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మండెపల్లిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అశోక్ లేలాండ్ సంయుక్త ఆధ్వర్యంలో రూ.22 కోట్లతో శిక్షణ సంస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐదెకరాల్లో పరిపాలన, వసతి గృహ భవనాలు, 15 ఎకరాల్లో డ్రైవింగ్ ట్రాక్‌లు నిర్మించినట్లు వివరించారు. శిక్షణ కాలపరిమితిలో 21 రోజుల కోర్సుకు రూ.7,080, 30 రోజుల కోర్సుకు రూ.16,520, మూడు రోజుల కోర్సుకు రూ.2250, ఒక రోజు కోర్సుకు రూ .750 చొప్పున ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు వివిధ కోర్సుల్లో 4 వేల మంది అభ్యర్థులు శిక్షణ పొందారని, 350 మందికి ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అందిస్తున్న శిక్షణను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో దశరథం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టైడ్స్ ప్రిన్సిపాల్ రాఘవన్

స్వాతంత్ర్య పోరాటంలో వడ్డే ఓబన్న పాత్ర కీలకం



నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్, జనవరి 11: స్వాతంత్ర్య పోరాటంలో వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం భావితరాలకు చాటి చెప్పాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న 217వ జయంతి వేడుకలను నిర్వహించారు. కలెక్టర్ పాల్గొని వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంచార జాతికి చెందిన వడ్డే కులంలో జన్మించిన వడ్డే ఓబన్న స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, వడ్డెర సంఘం అధ్యక్షుడు బొంతల సమ్మయ్య, ఉపాధ్యక్షుడు చల్ల రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కొమ్మరాజుల శ్రీనివాస్, ఓర్సు మురళి, భిక్షపతి వెంకటేష్, బొంత నగేష్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

తిమ్మాపూర్, జనవరి 11: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, నుస్తులాపూర్ సర్పంచ్ రావుల రమేష్ అన్నారు. మండలంలోని నుస్తులాపూర్‌లో ఎన్‌పీఎల్ క్రికెట్ పోటీలను గురువారం రావుల రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు వంగల శ్రీనివాస్‌రెడ్డి, నూనె రమేష్, సంపత్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, జనవరి 11: గంగాధర మండలం గట్టుబూత్కుర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. రామడుగు మండలం వన్నారం గ్రామం నుంచి గంగాధర మండలంలోని పలు గ్రామాలకు ఏలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారని పక్కా సమాచారం మేరకు గట్టుబూత్కు ర్ గ్రామశివారులో రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

చొప్పదండి, జనవరి 11: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి అన్నారు. గురువారం చొప్పదండిలో ఆయనే డీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సముద్రాల అంజయ్య, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీఎన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మోకీలు మార్పిడి



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ బీఎన్ రావు

సుభాష్‌నగర్, జనవరి 11: డాక్టర్ బీఎన్‌రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మోకీలు మార్పిడి చికిత్స అందించినట్లు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్ రావు తెలిపారు. స్థానిక ఆదర్శ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగాధర మండలంలోని సర్వారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దాసరి కనకమ్మ(70) పది సంవత్సరాలుగా తీవ్రమైన మోకీలు నొప్పులతో బాదపడుతోంది. వైద్యం కోసం డాక్టర్ బి ఎన్‌రావు వద్దకు రాగా ఆమెను పరీక్షించిన ఆయన ఆమె రెండు మోకీళ్లు మార్చాలని సూచించారు. అయితే అంతటి ఆర్థిక స్థోమత లేదని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్ బీఎన్‌రావు స్పందించి డాక్టర్ బీఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న నగరంలోని ఆదర్శ హాస్పిటల్‌లో ఆసుపత్రి సీఈవో, మెనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కరివెద సత్యనారాయణరెడ్డి సహకారంతో డాక్టర్ మామిడి అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఉచిత మోకీలు మార్పిడి ఆపరేషన్ నిర్వహించారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇది 23వ మోకీలు మార్పిడి చికిత్స అని తెలిపారు. ఆసుపత్రి సీఈవో డాక్టర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా డాక్టర్ బీఎన్‌రావు సౌజన్యంతో పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఝాన్సిలక్ష్మి, డాక్టర్ మామిడి అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అలీం తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం కొనుగోళ్లపై ఫిర్యాదు

హుజూరాబాద్/జమ్మికుంటరూరల్, జనవరి 11: హుజూరాబాద్ నియోజకవర్గంలో కొంతమంది రైస్‌మిల్లు యజమానులు రేషన్ బియ్యాన్ని కొనుగోళ్లు చేస్తున్నారని గురువారం సివిల్ సప్లయి ఎండీ దేవేంద్రసింగ్ చౌహాన్‌కు ఫిర్యాదు చేసినట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి తెలిపారు. ఈ కొనుగోలు చేసిన బియ్యాన్ని రిసైక్లింగ్ చేసి మళ్లీ ప్రభుత్వానికే అప్పగిస్తున్నారని వివరించారు. దీనిపై విచారణ చేస్తానని ఎండీ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

అక్రమ నిర్మాణాన్ని నిరసిస్తూ దీక్ష

జమ్మికుంట, జనవరి 11: జమ్మికుంట పట్టణంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా నిర్మాణం చేపట్టడాన్ని నిరసిస్తూ గాంధీ చౌరస్తాలో మాజీ వార్డు సభ్యుడు రవిచందర్‌రెడ్డి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేయాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అందుకోసమే ఆమరణ దీక్షకు దిగినట్లు తెలిపారు. ఇప్పటికైనా సదరు కౌన్సిలర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వారికి నచ్చ చెప్పి దీక్ష విరమింపజేశారు. కాగా కావాలనే తనపై కొంత మంది పని గట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని సదరు కౌన్సిలర్ తెలిపారు.

హుజూరాబాద్ ఎంవీఐగా ఠాకూర్ ఈశ్వర్‌సింగ్

హుజూరాబాద్, జనవరి 11: హుజూరాబాద్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా ఠాకూర్ ఈశ్వర్‌సింగ్ గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంవీఐ సిరాజ్ ఉర్ రహ్మాన్‌ను పెద్దపల్లికి బదిలీపై వెళ్లారు. హుస్నాబాద్‌లో ఎంవీఐగా విధులు నిర్వర్తిస్తున్న ఠాకూర్ ఈశ్వర్‌సింగ్‌ను హుజూరాబాద్ ఎంవీఐగా బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఠాకూర్ ఈశ్వర్‌సింగ్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

లేబర్ సంఘం గ్రామ కార్యవర్గం

చొప్పదండి, జనవరి 11: మండల పరిధిలోని గుమ్లాపూర్‌లోని శ్రీ వేంకటేశ్వర లేబర్ సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోలాపూరి కార్తీక్, ఉపాధ్యక్షుడు చిర్ర మల్లేశం, ప్రధాన కార్యదర్శి కోలాపూరి సాగర్, కోశాధికారిగా బత్తుల హరీష్, ప్రచార కార్యదర్శి గజ్జల రాములు, సంయుక్త కార్య దర్శి పెరుమాండ్ల గోపాల్, గౌరవాధ్యక్షుడిగా బత్తుల లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు.

బాలరత్న అవార్డ్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చిట్టుమల్ల శ్రీనివాస్, తదితరులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 11: మాస్క్ ఫిలిం ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో అందించనున్న బాలరత్న అవార్డ్స్ 2024 బ్రోచర్‌ను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్ గురువారం ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లాలోని బాలలకు సూపర్ కిడ్స్, సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగంలో డ్యాన్సింగ్, సింగింగ్ పోటీలు నిర్వహించి అవార్డులను అందజేయనున్నట్లు మాస్క్ ఇనిస్టిట్యూట్ అధ్యక్షులు భూనాథాచారి తెలిపారు. కార్యక్రమంలో చిట్టుమల్ల సాయి చైతన్య, వంగల శ్రీధర్, కట్ట జగన్, తూమోజు శ్రీనివాస్, తిప్పర్తి ప్రభు, నటులు గడ్డె ఉదయ్‌కుమార్, బొల్లం శ్రీనివాస్, తాటిపెల్లి సుభాష్, ఆకుల మోహన్, రాచమల్ల భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు







బిర్లా ఇంటర్నేషనల్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న సిబ్బంది, విద్యార్థులు, సెయింట్ జార్జ్, రావూస్ పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 11: జిల్లా వ్యాప్తంగా పలు విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాలయాలను సంక్రాంతి శోభ ఉట్టి పడేట్లుగా అలంకరించారు. ఆటా పాటలు, నృత్యాలు, వేషధారణలతో చిన్నారులు సందడి చేశారు. నగరంలోని మానేరు విద్యాసంస్థల్లో జరిగిన వేడుకల్లో చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి పాల్గొన్నారు. మంకమ్మతోటలోని పారమిత, లిటిల్ జీనియస్ పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూనా ప్రసాదరావు, రస్మిత, రాకేశ్, అనూకర్‌రావు, వినోద్‌రావు, హనుమంత రావు, వియయం ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మంకమ్మతోట, భగత్‌నగర్, విద్యానగర్‌లలో గల సిద్ధార్థ విద్యాసంస్థల్లో అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు. భగత్‌నగర్ రావూస్ పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించడంతోపాటు భోగి మంటలు, పతంగుల ఎగురవేత, భోగి పళ్లు వేసి పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు, సీఈవో నిదిన్‌రావు, ప్రిన్సిపాల్ రహమాన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నగరంలోని కోరా జాన్సన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోష్ రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కోతి రాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ పల్లవి, డైరెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్‌పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ ప్రసాదరావు, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ అనూకర్‌రావు, ప్రసూన, వినోద్‌రావు, ప్రసాద్, ప్రిన్సిపాల్ రితేష్‌మోహతా, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయకర్తలు రబీంద్రపాత్రో, హరిప్రియ, సరిత, రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో గురువారం పొంగల్ ప్లే కార్యక్రమాన్ని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● బిర్లా ఓపెన్‌మైండ్స్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో పాఠశాల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కొత్తపల్లి మండలం ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగిన వేడుకల్లో హెచ్‌ఎం టి ఆనందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● సెయింట్ జార్జ్ నిసోస్ బ్లాక్ సీబీఎస్ఈ విద్యాసంస్థలో జరిగిన వేడుకల్లో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి పాతిమారెడ్డి, ఇన్‌చార్జి సంగీత, సంధ్య, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

● తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల నగునూరులో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి సమత, ఆచార్యులు జి డి శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సుష్మ, ఎస్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె లావణ్య, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

● వివేకానంద ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థినులకు అడిషనల్ డైరెక్టర్ బి గోవిందరావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కె లక్ష్మణ్, యు మాధవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరిగిన వేడుకల్లో పాఠశాల చైర్‌పర్సన్ జోష్ నెడుంతుం డం, ప్రిన్సిపాల్ గీతాషాజు, డైరెక్టర్లు షాజు థామస్, గండ్ర సుధాకర్‌రెడ్డి, నూకల శ్రీనివాస్‌రావు, సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని విద్యోదయ విద్యాసంస్థల్లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏబూషి రామస్వామి, డైరెక్టర్లు జ్యోతి, ఆర్యన్ కౌశిక్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండి బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల, రుక్మాపూర్ మోడల్ స్కూల్, రాగంపేట జడ్పీ స్కూల్‌తోపాటు కృష్ణవేణి టాలెంట్ స్కూల్, గీర్వాని, సిద్ధార్థ స్కూల్స్‌లో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు.

రామడుగు: గోపాల్‌రావుపేట శ్రీప్రగతి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ అలే వెంకటనారాయణ, డైరెక్టర్లు ఉప్పుల శ్రీనివాస్, మునీందర్‌రెడ్డి, భూమయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

- మండలం వెదిర అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలను విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి ప్రారంభించారు.

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వేసిన రంగురంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి.

గంగాధర: మండల కేంద్రంలోని తేజశ్విని కళాశాలలో జరిగిన వేడుకల్లో కళాశాల చైర్మన్ వెంకట్, డైరెక్టర్ మల్లయ్య పాల్గొన్నారు. బూరుగుపల్లి, గంగాధర, గర్షకుర్తి, గట్టుబూత్కుర్ ప్రభుత్వ పాఠశాలలు, వివేకానంద విద్యాలయం, సురభి శాంతి నికేతన్, విన్నర్స్ ఎడ్జ్ పాఠశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు.

గన్నేరువరం: ముండల కేంద్రంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బూర వెంకటేశ్వర్, ప్రిన్సిపాల్ భానుచైతన్య, ఉపాధ్యాయులు సంతోష్, లత, నాందేవ్, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.



పొంగల్ ప్లే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వి నరేందర్‌రెడ్డి

'వాణీనికేతన్'లో జాబ్ మేళాకు స్పందన

గణేశ్‌నగర్,జనవరి 11: వాణినికేతన్ ఎంబీఏ కళాశాల, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాలో 10 కంపెనీలు, 324 మంది ఉద్యోగార్థులు పాల్గొన్నారు. ప్రతీ సంవత్సరం ఇలాంటి ఉద్యోగమేళాలను తమ కళాశాలలో నిర్వహించి విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్నామని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్, శాతవాహన యూనివర్సిటీ ఈసీ మెంబర్ ఐ దీపిక తెలిపారు. తమ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఉద్యోగ సాధనకు కావలసిన కమ్యూనికేషన్ స్కిల్స్ , ఇంటర్వ్యూ స్కిల్స్ పాస్ట్ స్కిల్స్ లాంటి విషయంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని కళాశాల డైరెక్టర్ డాక్టర్ డి వెంకట్రావు తెలిపారు. గురువారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 56 మంది ఉద్యోగార్థులు ఎంపిక కావడం జరిగింది. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. విద్యార్థులను వాణీనికేతన్ ఎంబీఏ కళాశాల అధ్యాపకులు అభినందించారు.

హిట్ అండ్ రన్ చట్టం డ్రైవర్లకు ఉరితాడు

భగత్‌నగర్, జనవరి 11: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన చట్టం హిట్ అండ్ రన్ డ్రైవర్లకు ఉరితాడుగా మారిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ అన్నారు. గురువారం కేంద్రం ప్రవేశపెట్టిన చట్టాన్ని వ్యతిరేకిస్తు కరీంనగర్‌లో లారీ డ్రైవర్లు, ఇసుక టిప్పర్ డ్రైవర్లు, రెడిమిక్స్ కాంక్రీట్ వాహన డ్రైవర్లు చేపట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2023 డిసెంబరు 21న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కొత్త సెక్షన్ 106(2)ప్రకారం డ్రైవర్లు పోలీసులకు గాని, మెజిస్ట్రేట్‌కు గాని తప్పించుకుంటే పది ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధించడంతో డ్రైవర్లకు ఉరితాడుగా పరిణమించిందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి, లారీ డ్రైవర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె ఆరిఫ్ మోహినోద్దీన్, ఇసుక టిప్పర్ల డ్రైవర్ల యూనియన్ నాయకులు శివ, శ్రీను, రెడీమిక్స్ డ్రైవర్లు రామచంద్రన్, నాయకులు శ్రీనివాసచారి, దస్తగిరి, ఎండీ షఫి, పవన్ మహేందర్, వెంకన్న, భద్రయ్య, సురేందర్, సదానందం, సత్యనారాయణ, హైమత్, రమేష్ తదతరులు పాల్గొన్నారు.

గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్



సప్తగిరి మిల్లులో తనిఖీ చేపడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

జమ్మికుంట, జనవరి 11: గడువులోగా సీఎంఆర్ పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని సప్తగిరి రైస్ మిల్లును తనిఖీ చేశారు. నిల్వలు, రికార్డులు పరిశీలించారు. ఆనంతరం ఎఫ్‌సీఐ గోదాములను తనిఖీ చేశారు. మిల్లర్ల నుండి వచ్చే బియ్యంకు గోదాముల్లో సరపడ స్థలం ఉందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30వరకు గడువు విధించిందని, కస్టమ్ మిల్లింగ్ రైస్ పెండింగ్ ఉన్న మిల్లర్లు గడువులోగా ఎఫ్‌సిఐకి అందజేయాలని సూచించారు. ఎవరైన వివిధ కారణాలు చూపించి లేవి బియ్యం పెట్టని ఎడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం విధించిన గడువు వరకు పొడగించకుండా ఈ నెల 21వ తేది వరకు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. నిబంధనల ప్రకారం బియ్యం నాణ్యంగా ఉంటనే అనుమతించాలి ఎఫ్‌సీఐ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట హుజూరాబాద్ ఆర్డీవో సోలిపురం రాజిరెడ్డి, తహసీల్దార్ రజనిరెడ్డి, ఆర్ఐ సందీప్, తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

సైదాపూర్, జనవరి 11: సైదాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థి సుంకె వంశీ జాతీయ స్థాయి అథెటిక్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. డిసెంబరు 26 నుంచి 30 వరకు మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో నిర్వహించిన 67వ జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్- 19 బాలుర విభాగంలో ప్రతిభ చాటాడని ప్రిన్సిపాల్ పర్వాన తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

గన్నేరువరం, జనవరి 11: గన్నేరువరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బుర్ర హర్షవర్ధన్ 67వ పాఠశాలల క్రీడా సమైఖ్య (ఎస్‌జీఎఫ్) కబడ్డీ పోటీకి రాష్ట్రస్థాయిలో ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామయ్య, పీఈటీ రాజబాబు గురువారం ఒక ప్రకటనతో తెలిపారు. 18న జనగామలోని దామరకంచలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాఠశాల విద్యార్థి పాల్గొననున్నట్లు తెలిపారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

మానకొండూర్, జనవరి 11: పశుసంవర్ధక శాఖలో రైతులకు ఉపయోగ పడే విధంగా కేంద్రప్రభుత్వ పథకాలు అందుబాటులో ఉన్నాయని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. (ఎన్‌ఎల్‌ఎం) నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పథకంలో గొర్రెల పెంపకం, నాటుకోళ్ళ పెంపకం, పందుల పెంపకం లాంటి పథకాలు 50 శాతం సబ్సిడీతో కేంద్రప్రభుత్వం ఆసక్తి గల రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉంది. గొర్రెల పెంపకానికి రూ. 20లక్షల నుంచి గరిష్ఠంగా కోటి రూపాయల వరకు లోన్ సౌకర్యం అందిస్తున్నది. పందుల పెంపకానికి రూ. 60లక్షల లోన్ సౌకర్యం షెడ్డు నిర్మాణం పూర్తి అయిన వారికి 50 శాతం సబ్సీడీ సౌకర్యం లభిస్తుంది.దీంతో పాటు పీఎంఈజీపీ (ప్రైమినిస్టర్ ఎంప్లాయ్ జెనరేషన్ ప్రోగ్రాం) అనే పథకం కింద పశువుల కోసం రూ. 20 లక్షల వరకు లోన్ సౌకర్యం ఉంది. ఇందులో 35 శాతం సబ్సిడీ మాత్రమే ఉంది.

విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

చొప్పదండి, జనవరి 11: పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం చొప్పదండిలో కర్ర, ఇనుము పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేసిన విశ్వకర్మ యోజన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేతివృత్తులు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, రజక, రాతిపని, ఆభరణాలు, చెప్పులు కుట్టేపని, దర్జీ, నాయీబ్రాహ్మణ, తదితర పనులు చేసే వృత్తి నిపుణులు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద లక్ష నుంచి మూడు లక్షల వరకు రుణ సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కుల సభ్యులు తాడూరి వెంకటాచారి, చిలుకునూరి రామస్వామి, తాడూరి ప్రవీణ్, గోవులకొండ ప్రదీప్, తాడూరి మహేష్, చిలుకునూరి రమేష్, రాగి శ్రీనివాస్, లివిన్, రామకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కూడారై ఉత్సవం



శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులు

ఇల్లందకుంట, జనవరి 11: ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయంలో జరిగే ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీగోదారంగనాయక స్వామికి గురువారం కన్నుల పండువగా కూడారై ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు వేదమంత్రోచ్చరణల నడుమ అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, అమ్మవారి నోము కార్యక్రమం జరిపిం చారు. కార్యక మంలో ఆలయ ఈవో కందుల సుధాకర్, సర్పంచ్ శ్రీలత-సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గోదాదేవికి కూడారై ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించిన ఏడీఏ

హుజూరాబాద్, జనవరి 11: ఇప్పల్‌నర్సింగాపూర్‌లో గురువారం ఆయిల్‌పామ్ తోటలను ఏడీఏ సునీత పరిశీలిం చారు. గత ఏడాది ఇప్పల్‌నర్సింగాపూర్‌కు చెందిన గూడూరి స్వామిరెడ్డి, గూడూరి మల్లారెడ్డి ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఈవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'వాగేశ్వరి'లో ఫ్రెషర్స్ డే వేడుకలు

తిమ్మాపూర్, జనవరి 11: వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఆహ్వాన కార్యక్రమ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వాగేశ్వరి విద్యా సంస్థల జనరల్ సెక్రటరీ జి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జనవరి 11: నగరంలో విద్యుత్ నూతన లైను ఏర్పాటులో భాగంగా శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ గురువారం ఒక ప్రకనటలో తెలిపారు. 11/కెవి, ఐబి ఫీడర్ లో విద్యుత్ చార్జింగ్ స్టేషన్ (బస్ స్టాండ్)కి ఐబి చౌరస్తా, గీతాభవన్ చౌరస్తా, యాక్సిస్ బ్యాంక్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

● సంక్షిప్త సమాచారం..

కరీంనగర్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా భూక్య ప్రేమ్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మూడవత్ వినోద్ నాయక్, కొత్తపల్లి మండల అధ్యక్షుడిగా లావుడియా సుధాకర్ నాయక్, కొత్తపల్లి పట్టణ అధ్యక్షుడిగా కూతటి శ్రీనివాసులు నియామకం అయ్యారు. వీరికి నగర అధ్యక్షుడు కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానోతు శ్రావణ్ నాయక్ పాల్గొన్నారు.

- టీఎస్ రెడ్‌కో, బ్యూరోఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ (బీఈఈ)ల ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాలోని ఎలక్ట్రిషియన్లు, ఎలక్ట్రికల్ షాపుల నిర్వాహకులకు గురువారం ఎన్టీఆర్ చౌరస్తాలోని ఒక హోటల్‌లో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో కరీంనగర్ ఎస్ఇ ఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, జిల్లా ఇంచార్జి మన్నె జీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన గురువారం ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

- కాంగ్రెస్‌పార్టీ అనుబంధ విభాగం సేవాదళ్ కరీంనగర్ టౌన్ అధ్యక్షుడిగా బుధవారపు శ్రీకాంత్ నియామకం అయ్యారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం కూడారై వేడుక ఘనంగా నిర్వహించారు.

- ధరణి ఫౌండేషన్, ఎస్‌కె అసోసియేట్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు మహాత్మా జ్యోతీబాపూలే గ్రౌండ్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థల బాధ్యురాలు దేవులపల్లి రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. పేర్ల నమోదు కోసం 9502296819, 9010290661 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

సుభాష్‌నగర్: వొడ్డెర జాతికి చెందిన ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించడాన్ని పురస్కరించుకొని వొడ్డెర సంఘం నాయకులు కలెక్టరేట్ ఎదుట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.

- నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(గంజ్), కుమ్మరివాడి ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివేకనంద జయంతిని పురస్కరించుకొని వివేకానందుని జీవితం యువతకు ఆదర్శం అనే అంశంపై హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

కరీంనగర్ టౌన్: సాక్షర భారత్ కో-ఆర్డినేటర్లను విధుల్లోకి తీసుకోవాలని వయోజన విద్యా కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జిల్లా అధ్యక్షుడు పడకంటి రమణ కోరారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

భగత్‌నగర్: జాతీయ కిసాన్ మోర్చా ఇన్‌చార్జి (ప్రభారి) బండి సంజయ్‌కుమార్‌ను జిల్లా కిసాన్‌మోర్చా నాయకులు పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు అన్నాడి రాజిరెడ్డి, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, మోతె గంగారెడ్డి, ఉరడి శివారెడ్డి, దాసరి రమణారెడ్డి పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లిలోని గంట మధుకర్ అనారోగ్యంతో బాధపడుతుండగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ శాఖ ఆధ్వర్యంలో రూ. 5వేల నగదు అందజేశారు. చందుపట్ల జనార్దన్, కోరకండ్ల రాజేందర్, మహ్మద్ ఖాలీద్‌హుస్సేన్, ఉప్పు శ్రీనివాస్, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, ఇల్లందుల సమ్మయ్యపాల్గొన్నారు.

సైదాపూర్: తెలంగాణ ప్రభుత్వ లెక్చరర్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న పెద్దముత్తని రాజశేకర్ నియామకమయ్యారు. జనరల్ సెక్రెటరీగా జైపాల్‌రెడ్డి, కోశాధికారిగా మహేందర్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజషన్ సెక్రటరీగా రాజేశ్వర్, ఈసీ మెంబర్‌గా రమేష్‌ను ఎన్నుకున్నారు.

- ఇటీవల బీసీ ఉద్యోగుల సంఘం కరీంనగర్ జిల్లా అధ్య క్షుడిగా నియామకమైన సైదాపూర్ ఏపీఎం కుమారస్వామిని సీసీలు, అధ్యక్షరాళ్లు, మండల సమైఖ్య సిబ్బంది ఎస్ఎన్ మేనేజర్, వీవోలు గురువారం సన్మానించారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన కాల్‌రైట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో 20 మంది మౌఖిక పరీక్షకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళా శాల నుంచి 120 మంది విద్యార్థులు పరీక్ష రాశారని తెలిపారు.

ఇల్లందకుంట: మండలంలోని రాచపల్లి, మల్లన్నపల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మెడికలాఫీసర్ డాక్టర్ తులసిదాస్, కేవీకే శాస్త్రవేత్త వేణుగోపాల్, ఏఈవో రాకేష్, పాల్గొన్నారు.

రామడుగు: మండల పరిధిలోని వెలిచాలలో గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం లింకు-4 కింద 4.24 ఎకరాల భూమిలో కాలువ కోసం బలవంతంగా భూసేకరణ చేపట్టిందని, ఇది సరికాదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొంకటి శేఖర్ అన్నారు.

- మండలంలోని దేశరాజుపల్లిలో పద్మపాని సొసైటీ లింక్ వర్కర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది

గంగాధర: బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రేణుక అన్నా రు. గురువారం గంగాధర మండలం గట్టుబూత్కుర్‌లో బాలల పరిరక్షణ కమిటీ మీటింగ్ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.

- గంగాధరలో పనిచేసిన ఉపాధిహామీ టీఏ వేణును ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా, సిబ్బంది సన్మానించారు.

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన అనుమాండ్ల ప్రకాష్‌ను గల్ఫ్ సేవాసమితి అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటుక లక్ష్మీపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

తిమ్మాపూర్: శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పాత బట్టల సేకరణ - పంపిణీ సత్క్రియ సెల్‌ని శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ కర్రా నరేందర్ రెడ్డి గురువారం ప్రారంభించారు.

కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని రాంనగర్ విశ్వశాంతి ఉన్నత పాఠశాల విద్యార్థిని సహలత్ సమా రాష్ట్రస్థాయి అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన ఆమె ఈ నెల 16, 17, 18 తేదీల్లో నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని పీఈటీలు ఎండీ పాషా, ఎ చంద్రశేఖర్ తెలిపారు. పాఠశాల డైరెక్టర్లు డి రమేష్, ఎన్ అంజనేయులు, ఎ గిరిధర్, ఎం రాజేశ్ అభినందించారు.